మల్లన్న జాతరకు వేళాయె..

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- ఆదివారం స్వామివారికి బోనాలు
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన నిర్వాహకులు



మల్లన్న దేవాలయం (ఇన్‌సెట్లో) గర్భగుడిలో నాగభరణ రూపంలో స్వామివారు

తాండూరు రూరల్: కోరికలు తీర్చే కొంగుబంగారంగా భక్తుల విశ్వాసం పొందిన మల్లన్నస్వామి జాతర ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండల పరిధి గౌతపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. మల్లన్న సన్నిధికి స్థానికులతో పాటు.. కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఆలయ చరిత్ర

పూర్వకాలంలో ఎడ్లను కొనుగోలు చేసేందుకు కర్ణాటక రాష్ట్రం ఎడ్డుల మైలారం గ్రామం నుంచి వ్యాపారులు తాండూరుకు వచ్చేవారు. ఓ రోజు రాత్రి కావడంతో గౌతపూర్‌లో ఇప్పుడున్న మల్లన్న ఆలయం వద్ద వారు ఎడ్లను కట్టేశారు. తెల్లవారు జామున అవి కనిపించలేదు. ఎంత వెతికినా దొరకకపోవడంతో అక్కడే నిద్రించారు. అప్పుడు వారికి కలలో ఓ నాగు పాము ప్రత్యక్షమై.. 'శ్రీశైలం మల్లన్న భక్తులు మీరు. ఎడ్లు కట్టేసిన గుండుపాదల వద్ద మల్లన్న దేవుడు ఉన్నాడు' అని వారికి ఆ సర్పం చరిత్ర చెప్పింది. మల్లన్నకు బోనాలతో పాటు, జాతర చేయాలని వివరించి మాయం అయింది. సర్పం చెప్పిన విధంగానే జాతర చేశారు. అనంతరం వారి ఎడ్లు కనిపించాయి. దీంతో నాటి నుంచి జాతర కొనసాగుతోంది. గ్రామ సమీపంలో మల్లన్న చెరువుకుంట వద్ద స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్నారు.

ఉత్సవాలు ఇలా..

శనివారం జాతర ప్రారంభం అవుతుంది. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి ఆలయంలో భక్తులు భజనలు చేస్తారు. ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామి వారిని గంగస్నానానికి తీసుకెళ్లి, డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి ఊరేగింపుగా తీసుకొస్తారు. సాయంత్రం 5 గంటలకు గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. రాత్రి ఒగ్గుకథ చెబుతారు. సోమ వారం స్వామివారికి పల్లకీసేవ అనంతరం ఊరేగిస్తారు.

గ్రామస్తుల సహకారంతో..



పూర్వ కాలం నుంచి మల్లన్న జాతర నిర్వహిస్తున్నాం. గ్రామ పెద్దలు, స్థానికుల సహకారంతో ఉత్సవాలు ఏటా వైభవంగా జరుపుతున్నాం. గతేడాది కొత్తగా ఆలయాన్ని నిర్మించాం. జాతర ఏర్పాట్లు అన్ని పూర్తిచేశాం. నూతనంగా నాగభరణం చేయించాం.

– మల్లన్న, ఆలయ పూజారి

విలీనం వద్దు.. పంచాయతే ముద్దు



యాలాల: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కోకట్ గ్రామస్తులు



తాండూరు: అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి గ్రామస్తుల వినతి

యాలాల: తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దు అని మండల పరిధి కోకట్ గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కోకట్ పంచాయతీని తాండూరు పురపాలికలో విలీనం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారని 'సాక్షి'లో గత మంగళవారం 'తాండూరు మున్సిపల్‌లోకి కోకట్!'పేరుతో కథనం ప్రచురితమైంది. ఇదే విషయమై రెండు రోజులుగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పంచాయతీ కార్యాలయంలో విస్తృతంగా చర్చలు జరిపారు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ.. తీర్మానించారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. గ్రామస్తుల అభిప్రాయాన్ని గౌరవిస్తామని, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మాజీ సభ్యుడు పురుషోత్తం రావు, మాజీ సర్పంచ్‌లు బాజారప్ప, నారాయణ రెడ్డి, వెంకటయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకర్, రాములు, నరేష్, శివారెడ్డి, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

అయ్యప్ప పడిపూజలో..

మండల పరిధి పాతశాలలో పాతశాల యాజమాన్యం, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు: పట్టణంలోని గౌతమి పాఠశాల మైదానంలో శుక్రవారం అయ్యప్పస్వామి పదునెట్టంబడి పడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి యూటీఎఫ్ మహాసభలు

పరిగి: నేటి నుంచి రెండు రోజుల పాటు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు జిల్లా మహాసభల నిర్వాహక కమిటీ కన్వీనర్ వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో విద్యాసదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం 8.30 గంటలకు సభ ప్రారంభం అవుతుందని తెలిపారు. సభలో విద్యాభివృద్ధి తదితర సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కావున యూటీఎఫ్ నాయకులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు జంగయ్య అన్నారు. రాంనగర్‌కు చెందిన లక్ష్మీహన్మయ్య ఆరోగ్య సమస్యలతో.. సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. చెక్ మంజూరు కావడంతో శుక్రవారం ఆయన బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో సాయికుమార్, రాంచంద్రయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



చిన్నారులతో పాఠశాల సిబ్బంది

యాలాల: విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. మండల పరిధి ముద్దాయిపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ హోదాల్లో తోటి వారికి పాఠాలు చెప్పి ఆకట్టుకున్నారు. అనంతరం బాలబాలికలను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ నవనీత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మీ, పర్వీన్ ఫాతిమా, రాములు తదితరులు ఉన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం



ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్‌రెడ్డితో అధ్యాపకులు

కొడంగల్ రూరల్: విద్యార్థి దశ ఎంతో కీలకమైనది, ప్రతి విద్యార్థి లక్ష్యం దిశగా చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శుక్రవారం అధ్యాపక బృందం సన్మానించింది. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్య, క్రమశిక్షణతోనే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే బాటను రక్షించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

యాలాల: ఊరచెరువు నుంచి పొలాలకు వెళ్లే బాటను కబ్జా నుంచి రక్షించాలని అన్నసాగర్ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని ఊర చెరువుతో పాటు పొలాలకు వెళ్లే దారిని.. కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. కబ్జా చెర నుంచి చెరువును కాపాడేందుకు సర్వే చేయించి, హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోయిని సాయిలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 52వ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండల పరిధి దాదాపూర్ పాఠశాలకు చెందిన దయాకర్ .. వనరుల నిర్వహణ అనే అంశంపై వ్యాసరచన నిర్వహించగా రెండో బహుమతి పొందాడు. మరో విద్యార్థి అక్షయ.. సిరి ధాన్యాలపై నిర్వహించగా రెండో బహుమతి సాధించారు. వీరు స్పీకర్ ప్రసాద్ కుమార్, కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

◆ మహిళా సాధికారతే లక్ష్యం

తాండూరు టౌన్: మహిళా సాధికారత దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి, కౌన్సిలర్ సాహు శ్రీలత అన్నారు. ఎల్ఐసీ బీమా సఖి యోజన పేరుతో ఇటీవల ప్రధాని మోదీ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. పదో తరగతి ఆపై చదివిన మహిళలకు ఉపాధి కల్పించడంలో భాగంగా వారికి ఎల్ఐసీ ఏజెంట్లుగా అవకాశం ఇవ్వడంతో పాటు.. మూడేళ్ల పాటు స్టైఫండ్ ఇవ్వనుందని పేర్కొన్నారు. ఇందులో చేరాలనుకునే వారు మీ సేవా కేంద్రంలో ఆధార్, పాన్ కార్డు, నివాస ధ్రువపత్రం, పదో తరగతి మెమో, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్సులు, పాస్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ క్రీడలతో మానసికోల్లాసం

ధారూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని తహసీల్దార్ జాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీల ముగింపులో వారు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీఓ షఫిఉల్లా ఉన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: క్రీడలతో మానసికోల్లాసం వస్తుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం కప్ క్రీడల ముగింపులో ఆయన మాట్లాడారు. ఆటల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

◆ జిల్లా స్థాయిలో అవార్డు

బొంరాస్‌పేట: జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభకు అవార్డు లభించింది. కొత్తగడి సీఓఈ పాఠశాల, కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జంతు కణం(యానిమల్ సెల్), ఘన, ద్రవ పదార్థాల్లో విద్యుత్ వాహకత (ఎలక్ట్రో కండక్టివిటీ సాలిడ్ అండ్ లిక్విడ్), కాంతి సాంకేతికత ద్వారా అటవీ జంతువుల నుంచి పంటల సంరక్షణ(క్రాప్ ప్రొటెక్షన్ యానిమల్ త్రూ లేజర్ టెక్నాలజీ) అంశంపై ప్రదర్శన చేశారు. వీరికి సభాపతి గడ్డం ప్రసాద్, జిల్లా అధికారులు అవార్డులు ప్రదానం చేశారు.

◆ ఆహారంతోనే ఆరోగ్యం

బొంరాస్‌పేట: ఆహారంతోనే ఆరోగ్యం అని తహసీల్దారు పద్మావతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, సామగ్రిని తనిఖీ చేశారు. భోజనం నాణ్యత లోపాలను దృష్టిలో ఉంచుకొని వంట ఏజెన్సీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో యాలాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరైన రూ.20లక్షలతో శుక్రవారం సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని హరిజనవాడ, కుర్వగల్లి, గోవిందరావుపేట తదితర ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అడిగిన వెంటనే గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, నాగయ్య, అశోక్ నాయీ, మారుతీ, శేఖర్ తదితరులు ఉన్నారు.

18 నుంచి ఒగ్గుడోలు శిక్షణ

యాలాల: మండల పరిధి ఎన్కెపల్లి గ్రామంలో ఈ నెల 18నుంచి ఒగ్గు డోలు శిక్షణ కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ, మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి నాందార్‌పూర్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమం 21 రోజుల పాటు నిత్యం 10 గంటలు ఉంటుందని, సుమారు వంద మందికి అవకాశం ఉందని చెప్పారు. 32 రకాల దరవులు, అడుగులు, విన్యాసాలతో శిక్షణ ఉండనుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూజారి మల్లప్ప, నాయకులు పూజారి కిష్టప్ప, తలారి శ్రీనివాస్, ఒగ్గు బీరు శిక్షకులు శివకుమార్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

చిన్నారులకు యూనిఫామ్స్ అందజేత



యూనిఫామ్స్ అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల పరిధి పుర్సంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, మహిళలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ, వెంకటయ్య, రాజశేఖర్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ముస్లిం అన్నదానం



అయ్యప్ప భక్తులకు భోజనం వడ్డిస్తున్న దాత

కుల్కచర్ల: అయ్యప్ప మాలధారణ భక్తులకు ముస్లి వ్యక్తి అన్నదానం చేసి మతసామరస్యాన్ని చాటారు. మండల కేంద్రానికి చెందిన పక్కిరి రుక్మొద్దిన్ శుక్రవారం అయ్యప్ప భక్తులకు స్థానిక అయ్యప్ప ఆలయంలో భిక్ష పెట్టారు. అనంతరం ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో దాతను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ సామ్యారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



దీపాలు వెలిగిస్తున్న గురుస్వామి

ధారూరు: అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. మండల కేంద్రంలో సన్నజాజుల రాజు గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం పడిపూజను నిర్వహించారు. నాగయ్య గురుస్వామి, కేవీఎస్ శర్మ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ.. పూజలు చేశారు. అనంతరం భక్తులకు గురుస్వామి అన్నదానం చేశారు.

మోత్కుపల్లి జాతర షురూ

కొడంగల్ రూరల్: నియోజకవర్గానికి సమీపంలోని కర్ణాటక రాష్ట్రం మోత్కుపల్లి బలభీమసేన స్వామివారి జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమయింది. ఈ సందర్భంగా ఉదయం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు.

ముక్కిన బియ్యం వెనక్కి పంపండి

- మెనూ ప్రకారం భోజనం అందించాలి
- ఆర్డీఓ వాసుచంద్ర
- కస్తూర్బా పాఠశాల తనిఖీ



ధారూరు: బాలికలతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర

ధారూరు: 'మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి. నాణ్యతో కూడిన పోషకాహారాలను వడ్డించాలి. ముక్కిన బియ్యం ఉంటే తిరిగి పంపించండి. ఏ మాత్రం తేడా వచ్చినా ఉపేక్షించేది లేదు. ఇక మీదట తరచూ హాస్టళ్లను తనిఖీ చేస్తాం' అని వికారాబాద్ ఆర్డీఓ ఎం.వాసుచంద్ర అన్నారు. శుక్రవారం ఆయన ధారూరు కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, కూరగాయలను పరిశీలించారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. అనంతరం మెనూ ప్రకారం గుడ్డు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించగా.. సదరు కాంట్రాక్టర్ సరఫరా చేయలేదని అక్కడి సిబ్బంది తెలిపారు. ఇదే విషయాన్ని విద్యార్థులు ఆర్డీఓ దృష్టికి తేగా.. మెను ప్రకారం ఆహారం పెట్టాల్సిందేనని ఆదేశించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీఓ నర్సింహులు, ఎంపీఓ షఫీఉల్లా తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దౌల్తాబాద్: మండల పరిధి దేవర్‌ఫసల్‌వాద్, దౌల్తాబాద్, గోకఫసల్‌వాద్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. దేవర్‌ఫసల్‌వాద్‌లో నిలువ ఉన్న ముక్కిన బియ్యాన్ని తిరిగి పంపిస్తే.. వేరే బియ్యాన్ని సరఫరా చేయనున్నట్లు నిర్వాహకులకు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దోమ: వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ మహేశ్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వంట శాలను పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్తరకం డైట్ మెనూ ప్రారంభించనున్నామని తెలిపారు. శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని, ఉదయం 11.30 గంటలకు విద్యార్థుల తల్లితండ్రులు హాస్టల్‌కు రావాలని సూచించారు. పిల్లల సమక్షంలో తల్లితండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం పరిశీలన చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో హాస్టల్ నోడల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: బియ్యం పరిశీలిస్తున్న ఎంపీడీఓ



దోమ: ఎస్సీహాస్టల్‌లో.. ఎంపీడీఓ మహేశ్ బాబు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే



చల్లాపూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం సంబంధిత అధికారులు మండల పరిధి గ్రామాల్లో పర్యటించారు. దరఖాస్తు దారుల ఫొటో, భూమి పత్రాల వివరాలు సేకరించారు. అనంతరం అర్హుల జాబితాను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులున్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారుల సేకరిస్తున్నారు. అనంతరం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నారు. మండల పరిధి ఎన్కేపల్లిలో అర్జీదారుల ఇళ్లకు వెళ్లి, వారి వివరాలను సేకరిస్తున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



సర్వే పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

అనంతగిరి: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంట్లు మంజూరు చేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధి 25వ వార్డు, సొంత వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజా పాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు దశల వారిగా ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు. అర్హులు అయినవారు మీ ప్లాటుకు సంబంధించిన పట్టా లేదంటే ప్రాపర్టీ టాక్స్ కట్టిన రసీదు, కరెంట్ బిల్లు ఏదున్నా దాని ఆధారంగా ఇంట్లు మంజూరు అవుతుందన్నారు. ఇప్పటికే ప్రతి వార్డులో ఏడుగురితో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశానమి, వారు ఇచ్చిన సర్వే ఆధారంగా అర్హులను గుర్తిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ జాకీర్ అహ్మద్, టీపీఓ వేణుగోపాల్, ఆర్వో కృపాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

'మనబడి' నిధులు విడుదల చేయండి



విద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: మనఊరు మనబడి కార్యక్రమం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధికారి నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల చైర్మన్లుగా కొనసాగిన వారు.. అప్పులు చేసి పాఠశాలల అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. కానీ బిల్లులు రాకపోవడంతో.. వారు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిధులు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, రవిచందర్, అరవింద్, మల్లెపల్లి వెంకటయ్య, చంద్రశేఖర్, జంగయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిషరిస్తున్న ఏబీవీపీ నాయకులు

పరిగి: ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్ కోరారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో ఈ నెల 23నుంచి 25వరకు వరకు నిర్వహించే సభలో అఖిల భారతీయ విద్యార్థి జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. సభలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వారి సమస్యలపై చర్చిస్తామని వెల్లడించారు. కావున ఏబీవీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గణేశ్, ధనరాజ్, సాయి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.